
ప్రజాశక్తి
గురువారం 1 జూన్ 2023
5
పార్వతీపురం మన్యం



మంచిపల్లికి ఉత్తమ రైతు పురస్కారం

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్



ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఉత్తమ రైతు పురస్కారానికి డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విద్యాలయం ఉత్తమ రైతు-2023 పురస్కారాన్ని తనకు ప్రకటిస్తూ వ్యవసాయ విద్యాలయ డైరెక్టర్ ఎల్.ప్రసాదరావు తెలిపారన్నారు. ఈ పురస్కారాన్ని జూన్ 12న గుంటూరులో గల వ్యవసాయ విద్యాలయ కాన్వకేషన్ హాల్లో అందజేస్తారన్నారు. రూ. 25వేలు నగదు, ప్రశంసా పత్రం, మెమొంటోతో సత్కరిస్తారని డైరెక్టర్ తెలిపారన్నారు. శ్రీరాములుకు ఈ పురస్కారం రావడం పట్ల ప్రకృతి వ్యవసాయ జట్టు ఆశ్రమ డైరెక్టర్ డి.పారినాయుడు అభిందనలు తెలిపారు.

కాసులిస్తే కొలతలు తారుమారు

- కనీస వేతనం కోసం తప్పని చెల్లింపులు
- అక్రమ వసూళ్లపై ప్రశ్నిస్తే వేధింపులు
- పని డిమాండ్‌లో కొరవడిన పారదర్శకత



మండుటెండలో పనులు చేస్తున్న వేతనదారులు

ప్రజాశక్తి- కలెక్టరేట్

సమయపాలన పాటించి, కొలతల ప్రకారం ఉపాధి హామీ పనిచేస్తేనే కూలి గిట్టుబాటు అవుతుందన్నది ఉన్నతాధికారుల మాట. ఆ నిబంధనకు కొన్నిచోట్ల తూచ్.. కొడుతున్నారు ఉపాధి సిబ్బంది. చేసే పనికి సంబంధం లేకుండా, పైసలిస్తేనే కనీస కూలి వచ్చేటట్లు రాస్తున్నారు. అదే, ముడుపులివ్వకుంటే కూలి గిట్టుబాటు కానివ్వరు. ఇదేమని అడిగితే, వారిపై వేధింపులు, పనులకు రానీయకపోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. దీంతో వేతనదారులు తప్పని పరిస్థితుల్లో ముడుపులు చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జిల్లాలో ఉపాధి హామీ సిబ్బంది రోజుకో రకంగా వేతనదారులను మభ్యపెడుతూ వారి నుంచి డబ్బులు కాజేస్తున్నారు. ఇప్పటి వరకు వేతనదారులు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం తగిన కొలతల్లో పనిచేస్తేనే కనీస వేతనం అందుతుందని చెప్పగా, నేడు వేతనదారులు ఎంత పని చేసినా సిబ్బంది రాసే కొలతలు ప్రకారమే కూలీలకు చెల్లింపులు జరుగుతాయి. దీంతో ఉపాధి హామీ సిబ్బంది డిమాండ్ చేసిన మొత్తాన్ని వారికి చెల్లిస్తేనే కనీస వేతనం పొందేలా కొలతలు నమోదు చేస్తామని చెబుతూ ఒక్కో కూలి నుంచి వారానికి వంద రూపాయలు చొప్పున బహిర్గతంగానే వసూలు చేస్తున్నారు. సిబ్బంది డిమాండ్ చేసినట్లుగా వారానికి 100 రూపాయలు చెల్లిస్తే పనులతో సంబంధం లేకుండా కనీస వేతనం వచ్చేలా కొలతలు నమోదు చేస్తున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు. ఎవరైనా వేతనదారులు అక్రమ వసూళ్లు అని నిలదీసినా, ఎదిరించి ప్రశ్నించినా వారికి కనీస వేతనం అందకపోగా తదుపరి వారంలో పని కూడా లేకుండా పోతుందని పలువురు కూలీలు వాపోతున్నారు.

పని డిమాండ్‌లో లోపించిన పారదర్శకత

పని డిమాండ్ విషయంలో పారదర్శకత లోపించింది. దీంతో సిబ్బంది తమకు అనుకూలంగా ఉన్న వ్యక్తులకు పని కల్పిస్తూ తమను ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపుగా పని లేకుండా చేస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. పని డిమాండ్ కోసం పేపర్లపై వేతనదారులు సంతకాలు చేసి తమ వివరాలను తెలియజేస్తూ ఫీల్డ్ అసిస్టెంట్లకు అందజేసినప్పటికీ ఆన్లైన్ చేసేటప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్ అనుకూలమైన వారికి పని కల్పించడం, లేని కూలీలను పనికి దూరంగా ఉంచుతున్నారు. ఈ విషయంపై ఫీల్డ్ అసిస్టెం ట్లను పైస్థాయి అధికారులు ప్రశ్నిస్తే సాంకేతిక లోపం వల్ల ఆ విధంగా జరుగుతున్నాయని చెబుతూ తప్పించుకుంటున్నారు. దీంతో వేతనదారులు ఈ సమస్యకు సరైన పరిష్కారం చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో మండుటెండల్లో రెండు పూటలా పనిచేయడం కష్టంగా మారింది. కొన్నిచోట్ల చెరువులు గ్రామాలకు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలో ఉండడంతో అక్కడకు నడవాల్సిన పరిస్థితి వస్తోంది. తీరా మండుటెండలో పనిచేస్తూ సేద తీరేందుకు నిలువ నీడ కూడా ఉండడం లేదు. అనేక చోట్ల పని ప్రదేశంలో చెట్లు లేకపోవడం, ప్రభుత్వం పని ప్రదేశంలో టెంట్లు పంపిణీ చేయకపోవడంతో సేద తీరేందుకు నిలువ నీడలేక వేతనదారులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు అధికారులు స్పందించి వేతనం దారుల నుంచి అక్రమ వసూళ్లను అరికట్టి, పని డిమాండ్ విషయంలో పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు. అలాగే పనులు జరుగుతున్న ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని వేడుకుంటున్నారు.

అక్రమ వసూలు చేస్తే చర్యలు తప్పవు



ఉపాధి హామీ కూలీల నుంచి ఎవరైనా అక్రమంగా డబ్బులు వసూలు చేస్తే వారిపై తగిన చర్యలు తీసుకుంటాం. జిల్లాలోని ఏ ప్రాంతంలోనైనా ఉపాధి హామీల అక్రమాలకు పాల్పడుతున్నట్లుగా ఫిర్యాదులు వస్తే వెంటనే పరిశీలన చేసి, అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిపై తగిన చర్యలు తీసుకుంటాం.

- కె.రామచంద్రరావు, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

అక్రమ వసూళ్లు బహిరంగ రహస్యం



జిల్లాలో ఉపాధి హామీ కూలీల నుంచి కనీస వేతనం పొందాలంటే ప్రతికూలి వారానికి వంద రూపాయలు చొప్పున చెల్లించాల్సి వస్తుంది. ఇదంతా అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం. క్షేత్రస్థాయి పరిశీలన వచ్చిన అధికారుల వద్ద ఎవరైనా అక్రమ వసూలు గురించి ప్రస్తావిస్తే ఆయా కూలీలపై కక్ష సాధింపుగా పని నిలిపివేయడం, తక్కువ కూలి వచ్చేలా వేధింపులకు గురి చేస్తున్నారు. కావున పై స్థాయి అధికారులు స్పందించి ఉపాధి హామీ పథకం లో పారదర్శకత పాటించేలా చర్యలు తీసుకోవాలి.

కొల్లి గంగునాయుడు, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి.



వేతనదారులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ప్రచార జాతాలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు 010 పద్దు కింద వేతనాలు చెల్లించి, టైం స్కేలు వర్తింప చేయాలని, కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, సిపిఎస్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రచార జాత బుధవారం రాత్రి పాలకొండ చేరుకుంది. ఈ జాతాకు స్థానిక నగర పంచాయతీ పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ ఆపరేటర్లు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులంతా ఘనంగా స్వాగతం పలికారు. ర్యాలీ అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కాంటాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, మండల కార్యదర్శి కాద రాము, మున్సిపల్ యూనియన్ నాయకులు పి భాస్కరరావు, సిహెచ్ సంజీవి, పి వేణు, సిహెచ్ సురేష్, వై హరిబాబు, వై సురేష్, పి సాయికుమార్, టి ఈశ్వర కుమారు, పి శ్రీనివాసు, శ్రీదేవి, కమల తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ : ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రచార జాతా పాలకొండ నుంచి పార్వతీపురం మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకుంది. ఈ జాతాకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, పట్టణ కార్యదర్శి బి.సూరిబాబు, ఎస్ఎఫ్ఐ రాజశేఖర్, పలువురు మున్సిపల్ కార్మికులు స్వాగతం పలికారు. అనంతరం జీపు జాతా సాలూరుకు బయలుదేరింది.



ర్యాలీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జీడి రైతు కుదేలు

- తగ్గిన దిగుబడి
- గిట్టుబాటు కాని ధర
- పట్టించుకోని ప్రభుత్వం
- ఆందోళనలో రైతాంగం



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దేశ విదేశాల్లో ఎంతో డిమాండ్ కలిగిన జీడి పిక్కలకు గిట్టుబాటు ధర రావడం లేదు. దీనికితోడు దిగుబడీ స్వలంగా తగ్గింది. ఫలితంగా పెట్టుబడులు కూడా రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీడికి శ్రీకాకుళం జిల్లా పెట్టింది పేరు. దానికి ఆనుకుని ఉన్న పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో సాగవుతున్న జీడికీ అంతే గిరాకీ ఉంది. పార్వతీపురం జిల్లాలో 68,137 ఎకరాల్లో, విజయనగరం జిల్లాలో 15,250 ఎకరాల్లో జీడి సాగవుతోంది. ఎకరాకు కనీసం రూ.20 వేల వరకు పెట్టుబడి అవుతోంది. ఇక్కడ సాగవుతున్న వేల టన్నుల జీడి పిక్కలను వ్యాపారులు కొనుగోలు చేసి, ప్రాసెసింగ్ అనంతరం జీడి పప్పును విదేశాలకు పంపుతున్నారు. కాస్త నాణ్యత ఉండడంతో మంచి డిమాండే ఉండేది. ఈ ఏడాది వర్షాలు సకాలంలో కురవడంతో పూత, పిందె ఆశాజనకంగానే కనిపించాయి. తిత్లీ తుపాను నుంచి వరుస నష్టాల పాలవుతున్న జీడి రైతులు ఈ ఏడాదైనా కాస్త అప్పుల నుంచి గట్టెక్కుతామని భావించారు. కానీ, సరిగ్గా పిందె దశలో అధిక వర్షాలు కురవడంతో కొంత నష్టం జరిగింది. గతంలో ఎకరాకు 200 కిలోల జీడిపప్పు దిగుబడి వచ్చేదని, ఈ ఏడాది 150 కిలోలు మాత్రమే వచ్చిందని ఎక్కువ మంది రైతులతోపాటు అధికారులూ చెబుతున్నారు. మరో వైపు ధర చూస్తే కొనబోతే కొరవి, అమ్మబోతే అడవి అన్నట్టుగా ఉంది. ప్రస్తుతం నాణ్యతను బట్టి కేజీ జీడిపప్పు ధర రూ.600 నుంచి రూ.800 వరకు ఉంది. ఈ లెక్కన 80 కిలోల జీడిపప్పు బస్తా రూ.48 వేల నుంచి రూ.64 వేల వరకు పలుకుతోంది. రైతులు విక్రయించే జీడిపిక్కలను ప్రాసెసింగ్ చేసే క్రమంలో మూడు వంతులు తగ్గుతుందనుకున్నా 80 కిలోల జీడిపిక్కలకు కనీసం రూ.16 వేలైనా రైతుకు అందాలి. ఇదే లెక్కన ధర నిర్ణయించాలని కోరుతూ జీడి రైతులు ఆందోళన చేస్తున్నారు. కానీ అధికారులు జోక్యం చేసుకోడం లేదు. పాలకులు పట్టించుకోవడం లేదు. తాము అధికారంలోకి వస్తే జీడి రైతులకు మద్దతు ధర ప్రకటిస్తామని చెప్పిన హామీని వైసిపి ప్రభుత్వం గాలికొదిలేసింది. దీంతో 80 కిలోల బస్తా రూ.6 వేల నుంచి రూ.7 వేలకు మించి వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. ఫలితంగా జీడి రైతులు నిలువు దోపిడీకి గురౌతున్నారు. కనీసం కిలో పిక్కలు రూ.100 కూడా పలకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీడి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

భారీ అన్నదానం

సీతానగరం : స్థానిక హనుమాన్ జంక్షన్ వద్ద ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా బుధవారం ఆర్యవైశ్య సంఘం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. గత మూడు రోజులుగా ఆంజనేయ విగ్రహం ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఎం.విశ్వేశ్వరరావు, ఎ.సత్యనారాయణ, ఎ.గోవింద, కె.గోపాలరావు, ఉప సర్పంచ్ కె.అరవింద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సబ్సిడీ ధరలకు నిర్మాణ సామగ్రి

ప్రజాశక్తి - పార్వతీపురం

పట్టణ గృహ నిర్మాణ సామగ్రిని ప్రభుత్వం సబ్సిడీ ధరలకు అందిస్తుందని, కావున లబ్ధిదారులు వినియోగించుకోవాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం మండల అధికారులతో జిల్లాలో అభివృద్ధి పనుల ప్రగతిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గృహనిర్మాణం, జగనన్నకు చెబుదాం, ఉపాధి హామీ పథకం, అమృత్ సరోవర్, ఇంటింటికీ మంచినీటి కుళాయి, రెండో విడత భూరీసర్వే మొదలగు పథకాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇనుము, సిమెంటు, శానిటరీ మొదలైన వస్తువులను ప్రభుత్వం సబ్సిడీ ధరలపై లబ్ధిదారులకు అందిస్తుందన్నారు. పెద్ద లేఅవుట్లలో ప్రభుత్వం అందిస్తున్న నిర్మాణ సామగ్రితో స్టాల్స్ ఏర్పాటు చేయాలని, అక్కడ ప్రభుత్వం అందించే ప్రతి వస్తువును ప్రదర్శనలో ఉంచాలని, అవసరమైన లబ్ధిదారులకు అందించాలని సూచించారు. బిల్లుల చెల్లింపునకు సంబంధించి నిధుల కొరత లేదని, స్టేజ్ వారీగా పనులు పూర్తయిన వెంటనే బిల్లులను అప్ లోడ్ చేస్తే వెంటనే చెల్లింపులు జరుగుతాయని అన్నారు. తదుపరి దశ పనులు వెంటనే మొదలు పెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలకు పూర్తి సంతృప్తికర పరిష్కారం చూపాలని, జిల్లాలో పెండింగులో గల ఫిర్యాదులను శనివారంలోగా పరిష్కరించాలని తెలిపారు. సంతృప్తికర పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలని, వారితో మాట్లాడినప్పుడు వీడియో స్టేట్ మెంటు తీసుకోవాలని, ప్రతి మండలంలో రెండు అర్జీల చొప్పున కేసు స్టడీ తయారుచేసి పంపించాలని తెలిపారు. జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం పనులకు సంబంధించిన ప్రతిపాదనలు, పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు, చెల్లింపుల కోసం వెంటనే పంపించాలన్నారు. సకాలంలో ప్రతిపాదనలు, బిల్లులు పంపిస్తే చెల్లింపులు జరుగుతాయన్నారు. నరేగా పనులకు హాజరు తేడాలు రాకుండా చూడాలన్నారు. పనులను అన్ని శివారు గ్రామాలకు సమానంగా కేటాయించాలని, పంచాయతీ వారీగా కాకుండా హేబిటేషనస్ వారీగా లక్ష్యాలు నిర్దేశించాలని సూచించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ఆర్ఓఎఫ్ఆర్ భూముల్లో పండ్లమొక్కల పెంపకం చేపట్టాలని తెలిపారు. రీసర్వేకు సంబంధించి రెండో విడత భూసర్వే చేపట్టిన గ్రామాల్లో సర్వే పనులను సకాలంలో పూర్తిచేయాలన్నారు. ముటేషన్లు, ఫైనల్ ఆర్ఓఆర్ సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జెసి సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకటరావు, డ్వామా పీడీ కె.రామ చంద్ర రావు, డిపిఒ బి.సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

మినీ జాబ్ మేళాకు 155 మంది హాజరు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పార్వతీపురం నియోజకవర్గం సంబంధించి స్థానిక వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఆవరణంలో డాక్టర్ రెడ్డీస్ ఫార్మా, ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ మినీ జాబ్ డ్రైవ్ నిర్వహించటం జరిగింది. ఈ జాబ్ డ్రైవ్‌కు డాక్టర్ రెడ్డీస్ ఫార్మా, ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ సంస్థ ప్రతినిధులు హాజరయ్యారు. బుధవారం రోజు జరిగిన ఈ జాబ్ డ్రైవ్‌కు సుమారు 155 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా అందులో 4 ఎంఎస్ఎన్ లేబొరేటరీస్ కంపెనీల్లో ఎంపిక కావడం జరిగింది. 15 మంది డాక్టర్ రెడ్డీస్ ఫార్మా కంపెనీ తుది రౌండ్ సర్టిఫికెట్ల కోసం ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ సిహెచ్. చలపతిరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం ఇది అరోవ సారి అనీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ వారి సహకారంతో మరిన్ని నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఇలాంటి అవకాశాలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నతశిఖరాలు అధిరోహించాలని అన్నారు.

మోసపూరిత హామీలతో టిడిపి మేనిఫెస్టో

డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

మోసపూరిత హామీలతో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మరోసారి మేనిఫెస్టో విడుదల చేశారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. బుధవారం ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కాని హామీ ఇవ్వడం, ప్రజలను మభ్యపెట్టడం చంద్రబాబుకు తెలిసినట్లుగా ఏ నాయకుడికీ తెలియదన్నారు. ఇటీవల మహానాడులో టిడిపి విడుదల చేసిన మేనిఫెస్టోలోని హామీలను చూసి జనం నవ్వుకుంటున్నారని చెప్పారు. ఆ హామీలను అమలు చేయాలంటే రెండు, మూడు రాష్ట్రాల బడ్జెట్‌లు కలిపినా చాలదన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని గుర్తు చేశారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయలేక టిడిపి చేతులెత్తేసిందని చెప్పారు. 600 హామీలతో విడుదల చేసిన మేనిఫెస్టోను కూడా ఇంటర్నెట్‌లో లేకుండా చేసిన ఘనత ప్రతిపక్ష పార్టీ దేనన్నారు. అలాంటి పార్టీ ఇప్పుడు ఎన్ని హామీలు ఇచ్చినా నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. గత ఎన్నికల ముందు సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో 98శాతం అమలు చేశారని చెప్పారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. 2018-19లో జిడిపి వృద్ధి రేటులో ఎపి 22వ స్థానం లో వుండగా ఆర్‌బిఐ తాజా నివేదిక ప్రకారం రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. గత ప్రభుత్వం హయాంలో తలసరి ఆదాయంలో ఎపి 17వ స్థానంలో వుంటే ఇప్పుడు 9స్థానంలో ఉందన్నారు. ఈ ఏడాది విశాఖ లో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ సమ్మిట్‌లో రూ.13.5లక్షల కోట్లను ఆకర్షించినట్లు తెలిపారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో వరుసగా మూడు సార్లు రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచిందని చెప్పారు. వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు మైనస్ 6.5శాతం వుండగా గత ఏడాది నాటికి 8.2శాతానికి చేరిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన లో రాష్ట్రం ముందంజలో వుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపి ని మళ్లీ గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని డిప్యూటీ సీఎం రాజన్నదొర చెప్పారు.

మంత్రి హోదాలో తొలి పుట్టినరోజు

డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి హోదాలో రాజన్నదొర తొలిసారి జన్మదిన వేడుకలను గురువారం జరుపుకోనున్నారు. కొద్దిరోజుల క్రితం నిర్వహించిన బైక్ ర్యాలీలో స్వల్ప గాయం కావడంతో ఆయన విశ్రాంతిలో ఉన్నప్పటికీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల కోరిక మేరకు యధావిధిగా పుట్టినరోజు వేడుకలను జరుపుకుంటారు. శుభాకాంక్షలు చెప్పడానికి వచ్చే అధికారి, అనధికార ప్రముఖులు, నాయకులు కార్యకర్తల రద్దీని దృష్టిలో ఉంచుకొని నివాసం లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆర్థిక భారం తగ్గించాలి

మున్సిపల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణాల్లో భూముల కొనుగోలుకు సంబంధించి డాక్యుమెంట్ విలువపై ఒక శాతం రుసుం వసూలు తగ్గించాలని వైసిపి కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను ఆమోదించారు. జీరో అవర్‌లో కౌన్సిలర్లు గిరి రఘు, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న డాక్యుమెంట్ విలువపై ఒక శాతం రుసుం వసూలు వల్ల మధ్యతరగతి ప్రజలపై కొంత భారం పడుతుందని చెప్పారు. దీన్ని అరశాతానికి తగ్గించాలని డిమాండ్. రూ.పది లక్షల చొప్పున కొనుగోలు చేసిన డాక్యుమెంట్ విలువపై రూ.పదివేలు రుసుం వసూలు చేస్తున్నారని, పది లక్షలకు ఒక రూపాయి పెరిగినా రూ.20లక్షలకు రుసుము వసూలు చేస్తున్నారని చెప్పారు. బొబ్బిలి, పార్వతీపురం పట్టణాల్లో కూడా ఈ విధానం అమలులో లేదన్నారు. దీనిపై కమిషనర్ హెచ్.శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారమే పెంచామని చెప్పారు. మున్సిపాలిటీ ఆదాయ, వ్యయాలను దృష్టిలో పెట్టుకొని పెంపు అవసరమని చెప్పారు. ఈసమావేశంలో వైస్ చైర్మన్లు జర్జాపు దీప్తి, వంగపండు అప్పలనాయుడు, కౌన్సిలర్లు పప్పల లక్ష్మణరావు, జి.నాగేశ్వరరావు, జి.వరప్రసాద్, సింగారపు ఈశ్వరరావు, బీసపు హైమ విజయలక్ష్మి, కె.సన్యాసమ్మ, టిడిపి కౌన్సిలర్లు వి.హర్షవర్ధన్, వైదేహి కృష్ణ, కె.వరలక్ష్మి పాల్గొన్నారు.



మున్సిపల్ సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శంకరరావు

ఎలక్ట్రానిక్ వాహనాలతో ఎంతో మేలు : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - పాలకొండ

ఎలక్ట్రానిక్ వాహనాలతో ఎంతో మేలు చేకూరుతుందని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తెలిపారు. నెడ్ క్యాప్ శ్రీకాకుళం ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గో ఎలక్ట్రానిక్- గో గ్రౌన్ అనే అంశంపై క్యాంపెన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వాహనాల వాడకం శ్రేయస్కరం అన్నారు. పర్యావరణాన్ని కాపాడవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో నెడ్ క్యాప్ మేనేజర్ ఐవి సుబ్రహ్మణ్యం, క్షేత్ర అధికారి జి.తిరుపతి, సబ్‌కలెక్టర్ కార్యాలయులు ఎఒ సావిత్రి తదితరులున్నారు.



విద్యుత్ బైక్‌ను ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్



తాగునీటి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

తాగునీటి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

మండలంలోని భాసురుకు తాగునీటి సమస్య ఉన్నందున ఆ సమస్యను పరిష్కరించే దిశగా తాగునీటి నిమిత్తం రూ.60 లక్షల అంచనా వ్యయంతో రావాడగెడ్డ వద్ద నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ నల్లి శివప్రసాద్, వైస్ ఎంపిపి కణపాక సూర్య ప్రకాష్, సర్పంచులు ద్వారపూడి కుమార్, విజయ్ కుమార్, యస్.మల్లేశ్వరమ్మ, లెంక చంద్రమౌళి పాల్గొన్నారు.



టెర్రసింగ్ పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ సత్యం

టెర్రసింగ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - సీతంపేట

ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న కుడ్డపల్లిలో టెర్రసింగ్ పనులను ఎంపిడిఒ కొండపల్లి సత్యం బుధవారం పరిశీలించారు. దీనిలో భాగంగా ఏవెన్యూ ప్లాంటేషన్ పరిశీలన చేశారు. అనంతరం ఉపాధి సిబ్బంది మాట్లాడుతూ వేతనాలు సకాలంలో చెల్లించాలన్నారు. కూలి గిట్టుబాటయ్యేలా కొలతలు ఇవ్వాలన్నారు. పనులు జరిగే చోట తాగునీరు, టెంట్లు వంటి వసతులు కల్పించాలని కోరారు. ఆయన వెంట ఉపాధి సిబ్బంది ఉన్నారు.



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

వేసవి విజ్ఞాన శిబిరాల పట్ల ఆసక్తి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవి విజ్ఞాన శిబిరాల పట్ల విద్యార్థులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం వేళల్లో గుమ్మలక్ష్మీపురం గ్రంథాలయానికి వచ్చి వార్తాపత్రికలు, కథలు, నవలలు, పోటీ పరీక్షల సమాచారం చదువుతున్నారు. బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు నిర్వహించారు. మండు వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి నేర్చుకోవడం అభినందనీయమని గ్రంథాలయం అధికారి సుకన్య అన్నారు.

పాలకొండ రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం 24వ రోజు విద్యార్థులు పాల్గొన్నారు. డ్రాయింగ్ మాస్టర్ జి.మురళికృష్ణ పిల్లలకు షాడో పెయింటింగ్‌లు ఎలా వేయాలో పిల్లలకు నేర్పించారు. గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు పాల్గొన్నారు.

తాగు నీటిని వృథా చేయొద్దు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వేసవిని దృష్టిలో పెట్టుకొని నీరు వృథా కాకుండా పలు వీధుల్లో కుళాయిలకు టాప్‌లను బిగించామని సర్పంచ్ గౌరీశంకర్రావు తెలిపారు. ఈ వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రతి కుళాయికి ట్యాప్‌లను బిగించామని, ప్రజలు నీటిని వృథా చేయకూడదని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పంచాయతీలో చింతలగూడ వీధి, చాకలి వీధి, పాత బస్టాండ్, మెయిన్ రోడ్డు, మెట్ట వీధి, విశాఖ గ్రామీణ బ్యాంక్ వీధి, గడ్డి కాలనీలో వాటర్ ట్యాపులు వేశారు. ప్రజలు వీటిని గమనించి అవసరమైన మేరకు నీటిని వినియోగించుకొని టాప్‌లను కట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. నీటిని ఎంత పొదుపు చేసుకుంటే భవిష్యత్తులో అంత మంచిదనిన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, భద్రగిరి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు వహీద్ ఖాన్, పలువురు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



కుళాయికి ట్యాప్ బిగిస్తున్న సర్పంచ్

వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

గుర్ల: నవధాన్యాలు సాగు వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ రీజనల్ అధికారి జి హేమసుందరరావు అన్నారు. బుధవారం మండల వ్యవసాయ కార్యాలయంలో విఎఎ, విహెచ్ఎలకు మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్షలు, విత్తనాభివృద్ధి, వైఎస్ఆర్ పొలం బడి ఇతర పథకాల పై విస్తృత అవగాహన కల్పించారు.

పొగాకు వినియోగంతో కేన్సర్

ప్రజాశక్తి -కలెక్టరేట్

పొగాకు వినియోగంతో కేన్సర్ సోకే ప్రమాదం ఎక్కువగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు హెచ్చరించారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని బుధవారం జిల్లా ఆసుపత్రి వద్ద ఆయన ప్రారంభించారు. పొగాకు వ్యతిరేక నినాదాలతో ఈ ర్యాలీ స్థానిక ఆర్టీసి కాంప్లెక్స్ వరకు నిర్వహించారు. అనంతరం డాక్టర్ జగన్నాథరావు మాట్లాడుతూ పొగాకు వల్ల కలిగే నష్టాలను అందరికీ తెలిపేందుకు, అవగాహన కల్పించే లక్ష్యంతో ర్యాలీ నిర్వహించడమైనదనీ, ప్రతి సంవత్సరం మే 31న పొగాకు వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటారని, పొగాకు వినియోగాన్ని తగ్గించుకుంటూ పోవడమే దీని లక్ష్యమని అన్నారు. పొగాకు తాగడం వల్ల క్యాన్సర్‌కు గురై ప్రతి ఏటా చాలా మంది మరణిస్తున్నారన్నారు. చుట్టా, బీడీ, సిగరెట్టు మొదలగు వాటిని తాగటం, వాటికి బానిస అవ్వడం వల్ల ఊపిరితిత్తులు, కేన్సర్, నోటి కేన్సర్, గుండె వ్యాధులు సంభవిస్తాయన్నారు. పొగతాగే వారితో పాటు దాన్ని పీల్చడం వల్ల కుటుంబంలో ఇతరుల ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో అవగాహన ర్యాలీలు వైద్య సిబ్బంది నిర్వహించారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ బి. వాగ్దేవి, డిఐఒ డాక్టర్ టి.జగన్మోహనరావు, డిసిఎమ్ భవాని, డెమోలు యోగీశ్వర రెడ్డి, సన్యాసిరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : ప్రపంచ పొగాకు నిరోధక దినోత్సవం సందర్భంగా ఎపివివిహెచ్ఎ గుంటూరు సౌజన్యంతో స్థానిక జన చేతన సంస్థ ఆధ్వర్యంలో పట్టణ కూడలిల్లో భవన కార్మికులకు, అంపిలి గ్రామ పరిసరాల్లో ఉపాధి హామీ కూలీలకు "ప్రాణాలను పీల్చేస్తున్న పొగాకు" 2023 సంవత్సరం అంశం (థీమ్)"ఆహారం కావాలి - పొగాకు కాదు" అంశాలపై అవగాహన కల్పించారు. ముందుగా పొగాకు రహిత సమాజం కోసం మనం పాటించాల్సిన నియమాలు, ఉత్తమ మార్గాలు, ధూమపానం, పొగాకు వల్ల కలిగే ఇబ్బందులు, పర్యావరణంపై ప్రభావం, పేదరికానికి కారణాలు మొదలైన అంశాలపై జనచేతన ముద్రించిన కరపత్రాలను అందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనచేతన కార్యదర్శి బగాది శశి భూషణచౌదరి మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల్లో ఉండే నికోటిన్ చాలా ప్రమాదకరమైనవి, కేన్సర్ వంటి దీర్ఘ కాలిక వ్యాధులకు గురిచేస్తుందని అన్నారు. వాటి జోలికి పోకూడదని హితవు పలికారు. ఎన్ఆర్ఇజిఎ ఫీల్డ్ ఆఫీసర్ బూరాడ రమాదేవి మాట్లాడుతూ సిగరెట్ కాల్చేవారి కంటే ఆ పొగ పీల్చే వారికే ఎక్కువ ప్రమాదమని అన్నారు. కావున ఎవరైనా ఆరుబయట పొగ పీల్చరాదన్నారు. కార్యక్రమంలో జన చేతన సిబ్బంది ఎం.సరస్వతి, ఎల్.కృష్ణారావు, శివ కుమార్, యోగేశ్వర రావు, భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి హామీ మేట్ లు, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: ప్రపంచ పోగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి నుండి మెయిన్ రోడ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పొగాకు వ్యతిరేకంగా స్లోగన్స్ ఇచ్చారు. ర్యాలీలో వైద్యాధికారి వైద్యాధికారి శిరీష, సూపర్వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. ప్రధాన కూడలి వద్ద మానవహారం చేస్తూ ప్రజలందరికీ పొగాకు, గుట్కా వంటి వాటి గురించి వివరిస్తూ నినాదాలు ఇచ్చారు.

వీరఘట్టం : పొగకు పీల్చడం ఆరోగ్యానికి హానికరమని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి ప్రజలను కోరారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలు వద్దు ఆరోగ్యం ముద్దు, మందు, సిగరెట్ వద్దు పౌష్టికాహారం ముద్దు, చుట్టా, బీడీ సిగరెట్టు ప్రాణానికి పెనుముప్పు, పొగాతాగవద్దు క్యాన్సర్‌కు గురికావద్దు గుండె జబ్బులకు కారణం ధూమపానం తదితర అంశాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఒ.శాంత కుమారి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాథరావు



సీతానగరంలో అవగాహన నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

జనసేన దీక్షకు పలు పార్టీలు సంఘీభావం

ప్రజాశక్తి - బలిజిపేట

అధికార వైసిపి నాయకుల దాడులకు నిరసనగా స్థానిక బస్టాండ్ వద్ద బుధవారం జనసేన నాయకులు చేపట్టిన నిరసన దీక్షకు టిడిపి రాష్ట్ర అధికారి ప్రతినిధి ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, సిపిఎం నాయకులు యమ్మల మన్మథరావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ బర్లిలో స్థానిక సమస్యలపై ప్రశ్నించిన జనసేన నాయకులు బంకురు పోలినాయుడు, గంట్యాడ స్వామినాయుడులపై వైసిపి నాయకులు భౌతికదారులకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమన్నారు. ఇలా చేసుకుంటూ పోతే ప్రజాస్వామ్య విలువలు మట్టిలో కలిసిపోతాయని హెచ్చరించారు. సమస్యలను పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే వాటిని పరిష్కరించాల్సింది పోగా అడిగిన జనసేన నాయకులపై దాడులకు ప్రేరేపించడం ఇటు ప్రజాస్వామ్యానికి, అటు నాయకత్వానికి మాయని మచ్చగా ఉంటుందని అన్నారు. భౌతికంగా దాడి చేయడమే కాకుండా పోలినాయుడు కుటుంబీలను భయాందోళనకు గురిచేసేలా హెచ్చరించడం పద్ధతి కాదని అన్నారు. ఇలాంటి సంఘటనలు మరలా జరిగితే ప్రతిఘటనలు చూపించాల్సిన ఉంటుందన్నారు. ఎమ్మెల్యే అహంకారాన్ని వీడి ప్రవర్తించాలన్నారు. పోలీసులు కూడా పార్వతీపురంలో ప్రతిపక్ష నాయకుడు దిష్టిబొమ్మను దగ్ధం చేసిన సమయంలో ఫిర్యాదు చేస్తే నేటికీ దానిపై స్పందించలేదన్నారు. పోలీసు ఉద్యోగాలు శాశ్వతమైనవని, రాజకీయ నాయకులు వచ్చి పోయే వారిని ఆలోచన చేసి విధి నిర్వహణలో మెలగాలని, లేని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. బొబ్బిలి చిరంజీవులు మాట్లాడుతూ భౌతిక దాడులకు పాల్పడిన వారిపై క్షేత్రస్థాయి దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఎం నాయకులు మన్మథరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను పాతిపెట్టేలా బాధ్యతలో ఉన్న ఎమ్మెల్యే సమక్షంలో ఇటువంటి చర్యలు జరగడం బాధాకరమని అన్నారు. వెంటనే ఈ విషయంలో క్షేత్రస్థాయి దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని, ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూసువాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన దీక్షలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు ద్వారపురెడ్డి జగదీష్

రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేయాలని మండలంలోని గడగమ్మ గ్రామానికి చెందిన పలువురు బుధవారం విలేకరుల వద్ద వాపోయారు. గ్రామంలోని బోరు బావులు ఏర్పాటు చేసినప్పటికీ తాగేందుకు పనికిరావడంలేదని, దీంతో సమీపంలో ఉన్న నాగావళి నది వద్దకు వెళ్లి చలమల ద్వారా నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి బోరు బావులు తప్ప అందుబాటులో ఎటువంటి చెరువులు కూడా లేవన్నారు. అన్ని కాలాల్లో నాగవళి నది చెంతకే నీటి కోసం పరుగులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. కలుషిత నీరు తాగడంతో రోగాల బారిన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని గడగమ్మ గ్రామస్తులు కోరుతున్నారు.

సాదాసీదాగా కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం సాదాసీదాగా జరిగింది. అరగంట వ్యవధిలోనే సమావేశం ముగిసింది. ఐదో వార్డు కౌన్సిలర్ వెలమల మన్మథరావు మాట్లాడుతూ నగర పంచాయతీలో రూ.40 లక్షలు నిధులు ఉన్నాయని, దీంతో కంపెక్టర్ లేదా వాటర్ ట్యాంకు కొనుగోలు చేయాలని కోరారు. 17వ వార్డు కౌన్సిలర్ కిల్లారి మోహనరావు మాట్లాడుతూ పోస్టు ఆఫీసు రోడ్ ఇరుగ్గా ఉందని, ఆ రోడ్డు వాహనాలకు అనుమతి ఇవ్వరాదని కోరారు. కమిషనర్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ మొక్కల పెంపకానికి రూ.4లక్షలు కేటాయించామని, దీంతో గ్రీన్ పాలకొండ చేస్తామని చెప్పారు. దీనిపై కౌన్సిలర్ మోహనరావు మాట్లాడుతూ మొక్కలు వేయడంతో పాటు వాటిని పెంచే బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ రౌతు హనుమంతరావు, పల్లా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



కంకర తవ్వుతున్న జెసిబి

తరలిపోతున్న కంకర

ప్రజాశక్తి - పాలకొండ

సహజ సంపద ఎక్కడ ఉందో కొంత మంది కనుక్కొని దాచుకోవడానికి వెనకాడరు. ఇసుక, మట్టి, కంకర ఇలా ఎక్కడ ఉన్నా గుర్తించి అక్రమార్కులు దర్జాగా దోచుకుంటున్నారు. అడిగే నాథుడు లేకపోవడంతో మండలంలోని పద్మాపురానికి చెందిన ఒక వ్యక్తి ఇదే వ్యాపారంగా మలుచుకున్నారు. ఏ గ్రామంలో కంకర ఉందో తెలుసుకొని దోచుకోవడం ఆయనకు అలవాటు. సంబంధిత అధికారులు దీనిపై ఎందుకు ఉదాసీనత చూపుతున్నారో తెలియడం లేదు. కొండలు, చెరువులు, ఇలా ఇక్కడి, అక్కడ కంకరను తవ్వి రవాణా చేస్తున్నారు. బహిరంగంగా ఇంత వ్యాపారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తాజాగా మండలంలోని తంపటాపల్లిలో చెరువులు తవ్వి కంకరను పెరుగుతున్నారు. ఇక్కడ ట్రాక్టర్‌కు రూ.3 వేల నుంచి రూ.4 వేలు వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జేసీబీతో దర్జాగా తవ్వి వ్యాపారం చేస్తున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవావల్సి ఉంది.

ఉపాధి అక్రమాలపై దర్యాప్తు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలం లోని దిబ్బగుడ్డి వలస గ్రామంలో ఉపాధి హామీలో జరిగిన అక్రమాలపై బుధవారం స్థానిక సచివాలయంలో ఉపాధి హామీ ఎపిడి జనార్దనారావు ధర్యాప్తు నిర్వహించారు. గురువారం ప్రజాశక్తిలో ప్రచురితమైన డబ్బులిస్తేనే జాబ్ కార్డు కదనానికి స్పందించన డ్వామా పీడీ క్షేత్రసాహయకు రాలిపై సస్పెన్షన్ చర్యలు తీసుకొన్నారు. దీనిపై బుధవారం ధర్యాప్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడి ఫిర్యాదు దారునితో, ప్రజాశక్తికి తెలియజేసిన సిహాచలం, కృష్ణలతోను, ఇతర కూలీలతోను మాట్లాడి వాస్తవాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతు ధర్యాప్తు నివేదికలు ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ ధర్యాప్తులో ఎపిఒ జనార్దనరావు, ఇసి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు అండగా డిసిఎంఎస్ సేవలు

ప్రజాశక్తి-విజయనగరం

ఖరీఫ్ సీజన్‌కు ముందునుంచే వరి విత్తనాల విక్రయం ప్రారంభించామని డిసిఎంఎస్ చైర్‌పర్సన్ డాక్టర్ అవనాపు భావన తెలిపారు. విజయనగరంలోని డిసిఎంఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం వరి, మొక్కజొన్న విత్తనాల విక్రయాన్ని ఆమె ప్రారంభించారు. వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జి అవనాపు విక్రమ్ విత్తనాలను ప్రథమంగా కొనుగోలు చేశారు. అనంతరం విద్యార్థులకు అవసరమైన లేపాక్షి నోట్స్ పుస్తకాల విక్రయాలను కూడా భావన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ప్రయోజనం కోసం మార్కెట్ కంటే తక్కువ ధరలో నాణ్యమైన ఎంటియు 1121, సోనా మసూరి, సాంబమసూరి, ఫౌండేషన్ వరి విత్తనాలను, పయొనీర్ మొక్కజొన్న విత్తనాల విక్రయాలను డిసిఎంఎస్ లో ప్రారంభించామన్నారు. గతేడాది విత్తనాలను వినియోగించిన రైతులు దిగుబడి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. కార్యక్రమంలో కోరుకొండ మాజీ సర్పంచ్ లాగుడు శివాజీ, డిసిఎంఎస్ డైరెక్టర్ ఎస్.సన్యాసినాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు కృష్ణ, డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ సాయి కుమార్, డిసిఎంఎస్ సిబ్బంది రమేష్, రాఘవులు, సూరప్పడు, సీతారామ్, రాజు, వెంకటరావు, పద్మ, వైసిపి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య

బాడంగి : మండలంలో ఆకులకట్ట గ్రామానికి చెందిన మేకల భవాని (15) 10వ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించలేదని, సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు కట్టి చదవటం లేదని తన తల్లి మందలించిందని గత నెల 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది. కొంత సమయానికి కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కొరకు బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి విజయనగరం, అక్కడి నుంచి విశాఖ కేజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృఇత చెందినట్లు మృతురాలి తాత మేకల సీతయ్య ఫిర్యాదు మేరకు బాడంగి ఎస్ఐ ఆర్. జయంతి కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

బాడంగి: మండలంలోని కోటిపల్లి గ్రామానికి చెందిన సుగ్గు సత్యనారాయణ దగ్గర అక్రమంగా ఉన్న 15 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసికొన్నట్లు ఎస్ఐ కొండలరావు బుధవారం తెలిపారు. తమకున్న ముందస్తు సమాచారం మేరకు మార్గం మధ్యలో సిబ్బందితో కలిసి పట్టుకొన్నట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదు

టిడిపి మేనిఫెస్టో చూసి వైసిపి నాయకులకు గుబులు

టిడిపి కురుపాం నియోజకవర్గ ఇన్‌ఛార్జి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మహానాడులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో వైసిపి నాయకుల్లో గుబులుపట్టుకుందని కురుపాం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి అన్నారు. గుమ్మలక్ష్మీపురంలోని తన స్వగృహంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళలు, యువతకు అండగా నిలవాలనే ఉద్దేశంతో మొదటి మేనిఫెస్టో రూపొందించినట్టు తెలిపారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ మేనిఫెస్టోను పక్కాగా అమలు చేస్తామని ఆమె తెలిపారు. పరిపాలన చేతకాని వైసిపి నాయకులు, స్థానిక ఎమ్మెల్యే టిడిపి మేనిఫెస్టో ను, చంద్రబాబు నాయుడు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న మేనిఫెస్టోను తీసుకొచ్చి ప్రకటించారని విమర్శించడం తగదన్నారు. చంద్రబాబును విమర్శించే స్థాయి స్థానిక ఎమ్మెల్యేకు లేదన్నారు. చంద్రబాబు విజన్ నాయకుడని అన్నారు. నాలుగేళ్లలో వైసిపి అమలు చేస్తున్న నవరత్నాలు ఏ ఒక్కరికైనా సక్రమంగా అందుతున్నాయా అని ప్రశ్నించారు. గిరిజన గ్రామాల్లో రోడ్లు సరిగా లేక గర్భిణీలను డోలీల సాయంతో ఆసుపత్రికి తీసుకు వస్తున్న గిరిజనుల కష్టాలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోందన్నారు. టిడిపి సీనియర్ నాయకులు వెంపటాపు భారతి మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో ను చూసి వైసిపి నాయకులు వ్యంగ్యంగా మాట్లాడడం సాంప్రదాయం కాదన్నారు. ప్రతి పార్టీకి ఒక మేనిఫెస్టో ఉంటుందని, దీన్ని మీరు గుర్తించాలన్నారు. మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని సిసి రోడ్లు నిర్మించారు, ఎన్ని మరుగుదొడ్లు కట్టారు, ఎన్ని వంతెనలు పూర్తి చేశారు, ఎన్ని ఇళ్లు కట్టించారో శ్వేత పత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. మీరు అమలు చేస్తున్న నవరత్నాలు ఎంతమందికి అందుతున్నాయో చెప్పాలన్నారు. ప్రజల మనోభావాలను తెలుసుకొని మాట్లాడాలని భారతి సూచించారు. విలేకరుల కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి పోలూరి శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు కద్రక కళావతి, జానకి, అడ్డాకుల నరేష్, చిన్నారావు కార్యకర్తలు పాల్గొన్నారు.




మండల కార్యాలయానికి వచ్చిన ఎరువులు

ఖరీఫ్‌కు యూరియా, వరి విత్తనాలు సిద్ధం

ప్రజాశక్తి - పాచిపెంట

ఖరీఫ్‌కు కావాల్సిన ఎరువులు, విత్తనాలు సిద్ధం ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 200 టన్నుల యూరియా, 70 టన్నుల డిఎపి ఎరువులు సిద్ధంగా ఉన్నాయన్నారు. అలాగే 68 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 20 క్వింటాళ్ల నవధాన్య విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. 700 క్వింటాళ్ల వివిధ రకాల వరి విత్తనాలు ఆర్‌బికెలకు ఇప్పటికే వచ్చాయని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో చిరుధాన్యాలు కూడా సిద్ధంగా ఉంచుతామని తెలిపారు. గిరిజన రైతులకు విత్తనాలు 90 శాతం రాయితీపై ఇవ్వనున్నామని, మిగిలిన రైతులకు జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా కిలో విత్తనానికి రూ.10 రాయితీ ఇస్తున్నామన్నారు. కావున రైతులంతా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులంతా రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువుల ధరలను ప్రదర్శించాలని, నిల్వలను కూడా రైతులకు తెలియజేయాలని తెలిపారు. ఈ ఏడాది ఎరువులకు, విత్తనాలకు ఎలాంటి కొరత ఉండదన్నారు.



బాషా కుటుంబ సభ్యులకు ఆర్థికసాయాన్ని అందజేస్తున్న వైసిపి నాయకులు

బాషా కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక మేజర్ పంచాయతీలో గల ఫైనల్ వీధికి చెందిన పెద్దింటి బాషా అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన సంఘటన తెలుసుకున్న మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, వైసిపి గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, వైసిపి వాణిజ్య విభాగాల జిల్లా అధ్యక్షులు అందవరపు కోటీశ్వరరావు బుధవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నిత్యవసర సరుకులు, నగదును అందజేశారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఏ సమయంలో ఏ అవసరమైన తమకు సంప్రదించాలని ఆయన కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు.

షాపుల వేలం వాయిదా

విజయనగరం టౌన్: స్థానిక రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఉన్న షాపుల బహిరంగ వేలం వాయిదా వేసినట్లు కార్పొరేషన్ సహాయ కమిషనర్ ప్రసాదరావు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని తొలుత ప్రకటించారు. కానీ బుధవారం నిర్వహించిన వేలం పాటకు సరైన స్పందన లేకపోవడంతో వేలం వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. తదుపరి జరిగే వేలం వివరాలను త్వరలో తెలియజేస్తామని చెప్పారు.